
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 । కనిష్ఠం : 21.0
ANDHRAJYOTHY
5



యథేచ్ఛగా అక్రమ రవాణా

- గ్రామాల్లో ఇంటింటికి తిరిగి బియ్యం సేకరణ
- రాత్రివేళ సరిహద్దు దాటిస్తున్న మాఫియా



రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుబడిన ఆటో

7

పొగమంచు కురిసింది..


క్లిక్.. క్లిక్..



మహబూబ్‌నగర్ పట్టణం బైపాస్ రోడ్డులో కురుస్తున్న మంచు

శీతాకాలం ప్రారంభంతో పొగమంచు కమ్మేస్తోంది.. గురువారం మహబూబ్ నగర్‌లో మంచుపొగల మధ్య వస్తున్న సూర్యకిరణాలు చూపరులను ఆకట్టుకున్నాయి.. ఇప్పటికే మార్కెట్‌లో వ్యాపారులు చలిని దృష్టిలో ఉంచుకుని స్వెటర్లు, బ్లాంకెట్‌ల విక్రయాలకు సిద్ధం చేసుకుంటున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి



మంచులో సూర్యకిరణాలు



పొగమంచులో పాలమూరు పట్టణం



సైకిల్‌పై జర్కిన్‌తో బాలుడు

తరలింపే శరణ్యం



బండమీదిపల్లిలో ఉన్న పశు పరిశోధన కేంద్రం

- గొర్రెల పరిశోధన కేంద్రానికి ప్రత్యామ్నాయ స్థలంపై సందిగ్ధత
- వేరేచోట స్థలం ఇస్తామని చెప్పినా కదలని దస్త్రం
- ప్రస్తుత స్థలంలో కోర్టు, బైపాస్ ఏర్పాటుతో తరలింపు అనివార్యం
- ఇప్పటికే అంతరించిపోతున్న దశలో దేశవాళి దక్కన్ జాతి గొర్రెలు
- ఉమ్మడి జిల్లాలో ఎక్కడైనా సాగుభూమి కేటాయిస్తే ఉపయోగకరం

అంతరించిపోతున్న దేశవాళి దక్కన్ జాతి గొర్రెల సంతతి పెంపుదల కోసం ఏర్పాటైన గొర్రెల పరిశోధన కేంద్రాన్ని తరలించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రస్తుతం ఉన్న స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగిస్తుండగా.. ప్రత్యామ్నాయ స్థలం కేటాయిస్తామని చెప్పినా... ఆ దస్త్రాలు ముందుకు కదలడం లేదు. ఫలితంగా తరలింపు అనివార్యమైనట్లు సమాచారం. ఈ పరిశోధన కేంద్రంలో సుమారు 250 దక్కన్ జాతి గొర్రెలు ఉన్నాయి.

మహబూబ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏడు దశాబ్దాల క్రితం ఏర్పాటైన గొర్రెల పరిశోధన కేంద్రం తరలింపునకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దేశవాళి దక్కన్ జాతి గొర్రెల సంతతిని పెంచడం, తద్వారా నాణ్యమైన అధిక మాంసాన్నిచ్చే గొర్రెల ఉత్పత్తికి, ఉన్ని ఉత్పత్తికి తోడ్పాటునివ్వడంతో పాటు, ఉమ్మడి జి ల్లాలోని మెట్ట ప్రాంతాల్లోని జీవాల పెంపకందారులకు గొర్రె పొట్టేళ్లను అందించడానికి దీనిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న స్థలం మొత్తం ఇతర అవసరాల వినియోగానికి వాడుకుంటుండటం, ప్రత్యామ్నాయ స్థలం కేటాయిస్తామని చెప్పినా ఇప్పటివరకు ఆ దస్త్రాలు ముందుకు కదలకపోవడంతో తరలింపు అనివార్యమేననే భావన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో గొర్రెల సంపద అత్యధికంగా ఉన్న జిల్లాల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా మొదటి స్థానంలో ఉంటుందని చెప్పవచ్చు. ఈ ప్రాంతానికి ప్రత్యేకమైన దేశవాళి నల్ల జాతి గొర్రెలు ఇప్పటికే అంతరించేపోయే దశకు చేరు కోగా.. ఈ పరిశోధన కేంద్రంలో దాదాపు 250 దక్కన్ జాతి గొర్రెలు ఉన్నాయి. వీటిపై

- మిగతా 6వ పేజీలో...

స్థలం ఇస్తే తరలింపు ఉండదు..



ప్రస్తుతం మహబూబ్‌నగర్ పరిశోధన కేంద్రంలో 250 దక్కన్ జాతి గొర్రెలు, 150 మేకలు ఉన్నాయి. పీయూ, బైపాస్ రోడ్డు, కోర్టు భవనాల సముదాయానికి స్థలం తీసుకున్నారు. ఇప్పటివరకు ప్రత్యామ్నాయంగా స్థలం కేటాయించలేదు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ప్రాజెక్టు వచ్చినా చేయలేని పరిస్థితి ఉంది. సాగుయోగ్యమైన భూమి కేటాయిస్తే తరలింపు ఉండదు.

- అనిల్‌కుమార్‌రెడ్డి, శాస్త్రవేత్త, పరిశోధన కేంద్రం హెడ్



పరిశోధన కేంద్రంలో ఉన్న దక్కన్ జాతి గొర్రెలు

న్యూస్ బాక్స్

రేపు మద్దూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రాక

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

మద్దూర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 మద్దూర్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణంలోని నిడ్జింత మార్గంలో హెలిప్యాడ్ స్థలాన్ని ఆమె పరిశీలించారు. ఆర్అండ్‌బీ, పోలీసు, రెవెన్యూ అధికారులు తీసుకోనున్న చర్యలపై సూచనలు చేశారు. సీఎం పర్యటన సందర్భంగా కల్పించాల్సిన భద్రతా ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై అధికారులకు సూచనలిచ్చారు. హెలిప్యాడ్ నిర్మాణాన్ని సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. మద్దూర్ పట్టణంలోని కాంగ్రెస్ యువ నాయకుడు సతీశ్ ఇటీవలే గుండెపోటుతో మరణించగా, ఆయన కుటుంబాన్ని సీఎం పరామర్శించనున్నారు. పర్యటన ఏర్పాట్లను స్థానిక తహసీల్దార్ మహేశ్‌గౌడ్, ఎంపీడీవో నర్సింహారెడ్డి, ఎస్ఐ రాంలాల్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పరిశీలించారు.

పాలమూరుపై స్పష్టతేదీ?

- ఈ ఏడాది ప్రాజెక్టు ద్వారా కృష్ణానది వరద జలాల వినియోగం లేనట్టేనా?
- మూడు మోటార్లు సిద్ధంగా ఉన్నా నీటి విడుదలకు తొలగని ఆటంకాలు
- రెండు టీఎంసీల నీటి ఎత్తిపోతతో చేతులు దులుపుకున్న గత ప్రభుత్వం



నార్లాపూర్ పంపుహౌజ్‌లో మోటార్లు



పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్యాకేజీ-1లో హెడ్ రెగ్యులేటర్

కొల్లాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సాగు, తాగునీటి అవసరాల కోసం చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై నేటికీ పూర్తిస్థాయిలో స్పష్టత కరువైంది. ప్రాజెక్టు ప్యాకేజీ-1లో భాగమైన నార్లాపూర్ పంపుహౌజ్, ప్యాకేజీ-2లో ఉన్న 6.40 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న అంజనగిరి రిజర్వాయర్లను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జీ చిన్నారెడ్డిలు ఇటీవలే క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అయినా పనుల్లో పురోగతి కనిపించడంలేదు. ఈ వర్షాకాలంలో ప్రాజెక్టు నుంచి నీటి ఎత్తిపోతలపై అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. గతేడాది సెప్టెంబరు 16న ప్యాకేజీ-1లో ఉన్న నార్ల పూర్ పంపుహౌజ్‌లో 145 మెగావాట్ల ఒక పంపు మోటారు ద్వారా ఎత్తిపోతలను ప్రారంభించారు. అప్పట్లో రెండు టీఎంసీల నీటిని అంజనగిరి రిజర్వాయర్‌కు ఎత్తి పోసి నిల్వ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లో ప్రాజెక్టు పనుల్లో ప్రధాన భాగమైన నార్లాపూర్ పంపుహౌజ్‌లో - మిగతా 6వ పేజీలో..

దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేయాలి



క్షేత్రస్థాయిలో స్థలాలు పరిశీలిస్తూ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

గద్వాలటౌన్/ఎర్రవల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు పట్టణంలో చేపట్టిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన త్వరగా.. పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. మునిసిపల్ అధికారులు గద్వాల పట్టణంలో చేపట్టిన ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను గురువారం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి తనిఖీ చేశారు. బీరెల్లి రోడ్డు, హమాలీ కాలనీ పరిసరాల్లోని లే ఔట్‌లను పరిశీలించారు. కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ లే ఔట్ల యజమానుల వివరాలు, చదరపు గజాల పరిమాణం తదితర అంశాలను విధిగా నమోదు చేయాలన్నారు. ప్లాట్ ఫొటోలను, డాక్యుమెంట్ల అప్‌లోడ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు, బఫర్‌జోన్, నాలాలు, చెరువులు ఉండే ప్రాంతాలు, కోర్టు కేసుల్లో ఉన్న స్థలాల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి వివరాలు నమోదు చేయాలన్నారు. పట్టణ పరిధి, గ్రామ స్థాయి నీటిపారుదలశాఖ పరిధిలో పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ఎర్రవల్లి, తిమ్మాపురంలో తనిఖీ చేశారు. కార్య క్రమంలో మునిసిపల్ కమిషనర్ దశరథ్, డీపీవో శ్యాంసుందర్, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాసరావు, టౌన్ ప్లానింగ్ అధికారి, ఆర్ఐలు, ఏఈలు, పంచా యతీ కార్యదర్శులు, మునిసిపల్ అధికారులు ఉన్నారు.

అండగా ఉంటాం

- ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ఆర్అండ్ఆర్ కాలనీని నిర్మిస్తాం
- కలెక్టర్ బదావత్ సంతోష్



ముంపు బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కొల్లాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులో గ్రామాలు ముంపునకు గురై నిర్వాసితులుగా మారిన వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని ఎర్రగుట్ట, బొల్లారం తండా, వడ్డె గుడిసెలు, అంజన్నగిరి, బోరబండ తండా, దూల్యా నాయక్ తండా గ్రామాలను గ్రామాలను కలెక్టర్ పరిశీలించారు. స్థానికులతో కలిసి ముంపు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను గుర్తించారు. ముంపుకు గురవుతున్న ఆయా గ్రామాల ప్రజల అవసరాలు, పునరావాసానికి కావలసిన సదుపాయాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం తరపున అన్ని సదుపాయాలు కల్పించి ఆర్అండ్ఆర్ కాలనీని నిర్మించి, ఆ కాలనీలో ప్రభుత్వ పాఠశాల, ప్రాథమిక ఆసుపత్రి, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని నిర్వాసితులకు భరోసా ఇచ్చారు. గ్రామస్థులు తమకు ఇల్లు కట్టుకునేందుకు నివాస స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, ఫారెస్టు అధికారుల నుంచి ఇబ్బందులు రాకుండా చూడాలని, ముంపులో కోల్పోయిన భూమికి బదులు భూమి ఇచ్చే విధంగా చూడాలని నిర్వాసితులు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. అంతకుముందు తమ గ్రామాన్ని సందర్శించేందుకు వచ్చిన కలెక్టర్ బదావత్ సంతోష్‌కు ఆయా గ్రామాల ప్రజలు పుష్ప గుచ్ఛం అందజేసి సత్కరించారు. కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డీవో యాదగిరి, తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు, కొల్లాపూర్ జడ్పీటీసీ మాజీ సభ్యుడు హనుమంత్ నాయక్, నిర్వాసితులు ఉన్నారు.

సన్నాలు వేసిన రైతులు నష్టపోవద్దు

- ధాన్యం గుర్తించడంపై పీపీసీ నిర్వాహకులకు అవగాహన ఉండాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



సన్నరకం ధాన్యంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సన్నరకం వరి పండించిన రైతులు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం వనపర్తి పట్టణంలోని నాగవరం రైతు వేదికలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్యాడీ ప్రొగ్రెసివ్ సెంటర్ (పీపీసీ) నిర్వాహకులకు సన్నరకం వరి ధాన్యం గుర్తించ డంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ప్రభు త్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తున్న నేపథ్యంలో ధాన్యాన్ని గుర్తించడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరు డిజిటల్ గ్రేయిన్ కాలిబర్ మీటర్‌ను తీసుకుని ధాన్యాన్ని గుర్తించడం నేర్చుకోవాలని సూచించారు. ఏ సెంటర్ నుంచైనా ధాన్యాన్ని తప్పుగా లోడ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సన్నాలు వేసిన రైతులు నష్టపోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే ఏఈవోలను సంప్రదించాలన్నారు. వర్షం వచ్చినా ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఈవీఎం గోదామును, కేడీఆర్‌నగర్‌లోని 16వ నంబరు రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి రేషన్ డీలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం లో పౌర సరఫరాలశాఖ డీఎం ఇర్ఫాన్, డీసీవో ప్రసాదరావు, డీసీఎస్‌వో కాశీ విశ్వనాథ్, డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, ఆర్డీవో పద్మావతి, తహసీల్దార్ రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి



ఇంటర్వ్యూ

వనపర్తి క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తోంది. ప్రజలు కూడా నేరాల నియంత్రణలో పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ రావుల గిరిధర్ గురువారం 'ఆంధ్రజ్యోతికి' ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారా..?

ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో ప్రజల్లోకి వెళ్లి నేరాలను తగ్గించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తోంది. ఏవైనా చిన్న చిన్న ఘటనలు జరిగిన వెంటనే తమ దృష్టికి వస్తే పరిష్కారించేందుకు చొరవ తీసుకుంటున్నాం.

చిన్నంబావి హత్య కేసు, గన్నీబ్యాగుల కేసులు ఏ దశలో ఉన్నాయి?

ఎస్పీ : ఈ రెండు కేసుల విషయంలో ప్రతీ రోజు విచారణ జరుగుతూనే ఉంది. నిందితులను పట్టుకోవడంలో కొంత ఆలస్యం కావచ్చు. కానీ ఎట్టి పరిస్థితుల్లో నిందితులను వదిలిపెట్టం. బయట వస్తున్న పుకార్లు నమ్మవద్దు.

భూ తగాదా కేసులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

భూ తగాదా కేసులు నేను రాకముందు ఎక్కువగా నమోదయ్యాయి. తాను ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తరువాత వచ్చిన చిన్న చిన్న ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరిస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేస్తారా..?

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా పెద్దగా ఏమీ జరగడం లేదు. ఎక్కడైనా జరిగినా మా అధికారులు, సిబ్బంది వెంటనే పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నారు. ఎక్కడైనా జరుగుతున్నట్లు సమాచారం ఇస్తే ఎంతటి వారైనా సరే చర్యలు తీసుకుంటాం.

సద్ది బువ్వ పెట్టారంటే వాతలు వచ్చేలా కొట్టారు

- కొడుకులపై తండ్రి ఫిర్యాదు, కేసు నమోదు

మానవపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాత్రి బువ్వ తీనే సమయంలో పొద్దున మిగిలిన బువ్వ పెట్టారని ప్రశ్నించిన తండ్రిని వాతలు వచ్చేలా కొడుకులు కొట్టిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్నది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మానవపాడు మండల పరిధిలోని జలాపురం గ్రామానికి చెందిన గుర్రంబండి నాయక కృష్ణయ్య కొన్నేళ్లుగా గుర్రం బండి నడుపుతుండేవాడు. గత ఎడాది వ్యవసాయ భూమి అమ్మి వచ్చిన నగదును కుమారులు వెంకటేష్, బీచుపల్లిలకు సమానంగా పంచాడు. 70 ఏళ్ల వయస్సు ఉన్న ఆయన భార్య ఐదు సంవత్సరాల క్రితం మృతి చెందింది. దీంతో కుమారుల దగ్గరే ఉంటున్నాడు. కొన్ని రోజుల నుంచి ఆయనకు ఇంట్లో సరైన వసతులు, భోజనం అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. రానురాను పగలు చేసిన బువ్వ మిగిలితే రాత్రికి, రాత్రి చేసిన బువ్వను ఉదయం పెట్టేవారని వాపోయాడు. బుధవారం కూడా పగలు చేసిన బువ్వను రాత్రికి పెట్టారు. దీంతో అన్నం సద్దిపడిందని కోడళ్ల, కొడుకులకు కృష్ణయ్య చెప్పాడు. దీంతో ఇద్దరు కొడుకులు ఆగ్రహంతో వాతలు వచ్చేలా కొట్టారు. ఈ విషయంపై అదే రాత్రి పోలీసులకు బాధితుడు చెప్పడంతో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. కుమారులను స్టేషన్‌కు పిలిచి తండ్రిని సరిగాచూసుకోవాలని మందలించి బాధితుడిని ఇంటికి పంపారు.



నాయక కృష్ణయ్య



కుమారుల దాడిలో నాయక కృష్ణయ్య వీపుపై ఏర్పడిన వాతలు

ప్రభుత్వ పథకాల అమలు భేష్

- సివిల్ సర్వీసెస్ ట్రైనీ అధికారుల మనోగతం



ధరూరు మండల కేంద్రంలో సెగ్రిగేషన్ పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్‌లు

7

బాలిక ప్రాణం ఖరీదు రూ. 13.50 లక్షలా?

- బాధితులను భయభ్రాంతులకు గురిచేసిన సీడ్ ఆర్గనైజర్, ఆయన బంధువు
- జిల్లా కేంద్రంలోని ఓ మాజీ ప్రజాప్రతినిధి ఇంట్లో కుదిరిన బేరం
- మరణ వాంగ్మూలం తమపై రాకుండా మంతనాలు

7

కంది పోయింది!

- పత్తి ధర లేక పెరిగిన సాగు విస్తీర్ణం
- వర్షాలకు ఎండుతున్న పంట
- వేల ఎకరాల్లో సాగు
- ఆందోళనలో అన్నదాతలు

ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంట రైతులకు కన్నీరు మిగిల్చింది. ఎడతెరపి లేని వర్షాలతో సాగు చేసిన ఈ పంటలు ఎండిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన రైతులు.. పంట ఎండుముఖం పడుతుండటంతో అయోమయంలో పడ్డారు. ఓ వైపు ప్రభుత్వం పప్పు దినుసుల సాగు చేయాలని ప్రోత్సహించడం, మరోపక్క పత్తికి గిట్టుబాటు ధర లేకపోవడంతో అలంపూర్ నియోజకవర్గంలోని రైతులు కంది సాగుపై దృష్టి సారించారు.

వడ్డేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దాదాపు 44వేల ఎకరాల్లో రైతులు కంది పంట సాగు చేశారు. ఇందులో అలంపూర్ నియోజకవర్గంలో 30వేల ఎకరాల్లో పంట సాగు చేశారు. కాగా, గత ఇరవై రోజులుగా కంది పంట ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత దశ రాక ముందు కంది పంట ఎండిపోవడంతో పాటు ఇటీవల పూత వచ్చిన దశలో వర్షాలు పడటంతో ఉన్నటువంటి పూత రాలిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది అధిక, అకాల వర్షాల వల్ల పంటలు ఎండిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట చేతికి రాక ఇటు శ్రమకు తగ్గ ఫలితం లేకపోవడంతో అప్పులతో పాటు పూట గడిచే పరిస్థితి లేదని వాపోతున్నారు.



కోవెలదిన్నెలో ఎండిన కంది పంట

గత సంవత్సం కంది క్వింటాలు రూ.10 వేల ధర పలకడంతో ఈ ఏడాది రైతులు కంది పంట సాగుపై మొగ్గు చూపారు. దీంతో నియోజకవర్గంలోని ఏడు మండలాలు ఉండగా ప్రతీ మండలంలో నాలుగు నుంచి ఐదు వేల ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. కష్టపడి సాగుచేసిన కంది పంట కళ్లెదుటే ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత తరుణంలో కంది పంట పండే అవకాశం చాలా తక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు. భారీ వర్షాలు కురియడంతో గడ్డితో పాటు పంటలకు చీడ పురుగులు ఆశించాయి. దీంతో కలుపు నివారణకు కూలీలతో పాటు గడ్డి మందులు అధికారికంగా వాడాల్సి వచ్చింది. పంట ఎండిపోతుందని ఆందోళనలో బ్యాక్టరీయా పురుగుల మందులు ఎక్కువసార్లు పిచికారి చేయడంతో పెట్టుబడి ఖర్చులు కూడా విపరీతంగా పెరిగాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే తాము అప్పులపాలు కావాల్సి వస్తుందని రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి నియోజకవర్గం పరిధిలో ఎండిన పంటలను తక్షణమే సర్వే చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపి తమను ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎడతెరపి లేని వర్షాల వల్లే..

ప్రస్తుత సంవత్సరం ఎడతెరపిలేని వర్షాల వల్ల పంట ఎండిపోవడం వాస్తవమే. దిగువ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి కుళ్లిపోవడం జరుగుతుంది. పంట నష్టపరిహారం విషయమై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. అధికారుల సలహా మేరకు మందులు పిచికారి చేసుకుంటే కొంతవరకు నివారించుకోవచ్చు.

- సక్రియానాయక్, ఏడీఏ, అలంపూర్

14 ఎకరాల్లో కంది సాగు చేశా

గత ఏడే కంది పంటకు మంచి ధర పలికింది. లక్షలాది రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టి 14 ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. గత ఇరవై రోజులుగా ఎడతెరపిలేని వర్షాలకు కంది పంటపై ప్రభావం చూపింది. నాలుగు ఎకరాల దాకా పంట ఎండిపోయింది. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లిస్తేకొంత గట్టెక్కుతాం.

- రామకృష్ణారెడ్డి, రైతు, పైపాడు



తరలింపే శరణ్యం!

(మొదటిపేజీ తరువాయి)

పరిశోధనలు చేస్తూ.. కొత్త బ్రీడ్‌లను పెంచేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. గతంలో తరలింపు ప్రస్తావన వచ్చిన సమయంలో గొర్రెలు, మేకల పెంపకందారుల జేఏసీ ఆధ్వర్యంలో నిరసనలు చేయడంతో తరలింపు ఉండదని అప్పట్లో కలెక్టర్ ప్రకటించారు. ప్రత్యామ్నాయ స్థలం చూస్తామని చెప్పడంతో పాటు వీరన్నపేట శివారులో 20 ఎకరాల భూమిని పరిశీలించారు. కానీ ఇప్పటివరకు స్థలం కేటాయింపు ప్రక్రియ సాగలేదు. ఈ నేపథ్యంలో ఆ స్థలంలోనే కోర్టు భవనాలకు, బైపాస్ రోడ్డుకు స్థలం పోతుండటంతో ఏం చేయాలో తెలియక పరిశోధన కేంద్రం అధికారులు.. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి సానుకూల స్పందన రాలేదు.

ప్రాభవం కోల్పోయిన పరిశోధన కేంద్రం..

కుక్కను చంపాలంటే ముందుగా దాన్ని పిచ్చిదాన్ని చేయాలనే ఒక నానుడి ప్రచారంలో ఉంది. ఆ చందంగానే ప్రస్తుతం గొర్రెల పరిశోధన కేంద్రం పరిస్థితి తయారైంది. తెలంగాణకు చెందిన దేశవాళీ దక్కన్ గొర్రెల జాతి వృద్ధికి అవసరమైన పరిశోధనలు నిర్వహించే ఉద్దేశంతో 1952లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర సమీపంలోని బండమీదపల్లి వద్ద గొర్రెల పరిశోధనా కేంద్రాన్ని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ ఏర్పాటు చేసింది. అప్పట్లో ఈ కేంద్రానికి ఇక్కడ 270 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. 1993లో దీన్ని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయానికి, 2000 సంవత్సరంలో తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయానికి అనుసంధానించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఈ కేంద్రం పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోకి వచ్చింది. ఈ కేంద్రాన్ని ఎప్పటికప్పుడు ఆయా శాఖలు, సంస్థలకు మారుస్తూ రావడం, విధానాలు మారడం, గొర్రెల పరిశోధనలపై ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకోకపోవడం వంటి కారణాలతో ఈ కేంద్రం కూడా క్రమేపీ ప్రాభవం కోల్పోతూ వచ్చింది. గతంలో గొర్రెల పంపిణీని చేపట్టిన విషయం తెలిసిందే.. ఆ సమయంలో గొర్రెల సంతతి పెంపునకు పరిశోధన కేంద్రాలు కూడా ఏర్పాటు చేయాలని భావించారు. వనపర్తిలో స్థలం కూడా కేటాయించారు. అప్పుడు ఈ పరిశోధన కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేస్తారనే ఆశలు చిగురించాయి. కానీ అటు ప్రత్యామ్నాయ స్థలం చూపలేదు.. ఇటు అభివృద్ధి ఆలోచనలు చేయలేదు.

స్థలమే సమస్య..

ఎన్నో రకాల ప్రభుత్వ భవనాలకు, ఆధునిక సదుపాయాల కోసం స్థలాలు గుర్తించి.. కేటాయింపులు చేస్తున్న ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకే తలమానికంగా ఉన్న గొర్రెల పరిశోధన కేంద్రం స్థలం తీసుకుని.. ప్రత్యామ్నాయం చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవు తున్నాయి. మొదట్లో ఇక్కడ 270 ఎకరాల స్థలం ఉండగా.. పరిశోధన కేంద్రం, పాలిటెక్నిక్ కాలేజీలు ఏర్పాటయ్యాయి. కేంద్రానికి అవసరమైన భవనాలు, ల్యాబరేటరీలు, షెడ్లు, పశుగ్రాస పెంపకానికి అనుగుణంగా ఈ స్థలాన్ని విభజించారు. సరిహద్దులు నిర్ణయించకపోవడంతో చుట్టుపక్కల కొంతభూమి ఆక్రమణలకు సైతం గురైంది. ఈ కేంద్రం నిర్వహణపై ప్రభుత్వాలు శీతకన్నేసిన నేపథ్యంలో వేర్వేరు సందర్భాల్లో ఇక్కడి భూమిని వేర్వేరు సంస్థలకు కేటాయిస్తూ వచ్చారు. పాలమూరు యూనివర్శిటీ ఏర్పాటు సమయంలో 170 ఎకరాల పైచిలుకు భూమిని వర్శిటీకి కేటాయించారు. ఇప్పుడు అక్కడ ఏడెకరాలు బైపాస్ రోడ్డుకు తీసుకున్నారు. 10 ఎకరాలు కోర్టుకు కేటాయించారు. 19 ఎకరాల్లో వెటర్నరీ యూనివర్సిటీ కాలేజీకి సంబంధించిన భవనాలు ఉన్నాయి. అవిపోను అయిదెకరాలు మిగులుతున్నప్పటికీ.. ఆ భూమి సాగుకు యోగ్యంగా లేదు. దీంతో ప్రత్యామ్నాయ స్థలం చూపడం తప్పా మరో మార్గం లేకుండా పోయింది. ఈ పరిశోధన కేంద్రాన్ని సోమవారం ఉన్నతాధికారులు పరిశీలించనున్నారు. ఆ తర్వాత తరలింపు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో మన్ననూరు లేదా మరికల్‌లో స్థలం కోరుతున్నా.. ఇప్పటివరకు ఆ దిశగా అడుగులు మాత్రం పడటం లేదు. ఒక వేళ ఉమ్మడి జిల్లాలో స్థలం కేటాయించకపోతే హైదరాబాద్ లేదా వరంగల్‌కు పరిశోధన కేంద్రం తరలిపోయే అవకాశం ఉంది.

తరలిస్తే ఇబ్బందులు పడతాం..



తెలంగాణకే ప్రత్యేకమైన దక్కన్ జాతి గొర్రెలను రక్షించుకోవాలంటే పరిశోధన కేంద్రం ఇక్కడ కొనసాగాల్సిందే.. రాష్ట్రంలోనే అత్యధిక గొర్రెల సంతతి ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉంది. ఎంతోమంది గొర్రెలు, మేకల పెంపకందారులకు ఈ కేంద్రం వల్ల ఉపయోగం జరిగింది. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు కూడా కేంద్రం తరలిస్తే ఉపాధి కోల్పోతారు. అంత దూరం వెళ్లి పనిచేయాలంటే కూడా చాలా ఇబ్బందులు ఎదురవుతాయి.

- దామోదర్, ఉద్యోగి, గొర్రెల పరిశోధన కేంద్రం

అంకితభావంతో పని చేయాలి

- జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్
- పలు పోలీస్ స్టేషన్ల తనిఖీ



మరికల్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ చౌహాన్

మరికల్/నారాయణపేట/ధన్వాడ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో మమేకమై పోలీసులు అంకిత భావంతో పనిచేయాలని, ప్రతీ కేసులో పారదర్శకంగా విచారించి, బాధితులకు న్యాయం చేయాలని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా గురువారం నారాయణపేట జిల్లాలోని మరికల్ సర్కిల్ కార్యాలయం ,నారాయణపేట పోలీస్ స్టేషన్, జిల్లా పోలీస్ కార్యాలయం, ధన్వాడలో ఎస్పీ శ్రీయోగేష్ గౌతమ్‌తో కలిసి పర్యటించారు. ఆయా స్టేషన్లలో రికార్డులు, పరిసరాలను, సిబ్బంది విధులను పరిశీలించారు. మొదట మరికల్ సర్కిల్ కార్యాలయం పరిశీలించి గౌరవ వందనం స్వీకరించారు. సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో 100కు కాల్ రాగానే వెంటనే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సమస్యలను పరిష్కరించేటట్లు చూడాలని, అలాగే నిరంతరం గస్తీ నిర్వహించేటట్లు ఎస్ఐలు చేపట్టాలని సీఐ రాజేందర్‌రెడ్డికి సూచించారు. రౌడీ షీటర్స్, అనుమానితులు, పాత నేరస్తులపై నిఘా పెట్టాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ విధానాన్ని అమలు చేయాలన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఐజీ గౌరవ వందనం స్వీకరించిన అనంతరం కార్యాలయం పరిసరాలను పరిశీలించారు. కార్యాలయం సిబ్బందితో మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సర్వీస్‌కు సంబంధించి వచ్చే విన్నపాలు ఉన్నతాధికారుల ఆదేశాలపై ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్, సీఐలు శివశంకర్, చంద్రశేఖర్, రామ్‌లాల్, ఆర్ఐ నరసింహ, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై దృష్టి

పోలీస్ అధికారులు నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని జోగులంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. గురువారం ధన్వాడ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. నూతనంగా నిర్మించిన స్టేషన్‌ను పరిశీలించి, ఆవరణలో మొక్కలు నాటారు.



సుంకేసుల జలాశయానికి పెరిగిన వరద

- ఇన్‌ఫ్లో 1.18 లక్షలు, అవుట్ ఫ్లో 1.15 లక్షల క్యూసెక్కులు

రాజోలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండల శివారులోని సుంకేసుల జలాశయానికి వరద పెరిగింది. గురువారం 1.18 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో 28 గేట్లు ద్వారా 1.15 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యాం జేఈ రాజు తెలిపారు. డ్యాం సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.917 టీఎంసీలు నీరు ఉందని, డ్యాం నీటిమట్టం 292.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 291.20 మీటర్లు నమోదు అయినట్లు ఆయన తెలిపారు.

చెన్నై బయలుదేరిన పీయూ బ్యాడ్మింటన్ జట్టు



పీయూ బ్యాడ్మింటన్ పురుషుల జట్టు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పురుషుల జట్టు ఆలిండియా సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనేందుకు గురువారం తమిళనాడు రాష్ట్రం చెన్నై బయలుదేరింది. ఈ పోటీలు 26 నుంచి 29 వరకు జరుగుతున్నాయని, క్రీడాకారులు మంచి ప్రతిభ కనపరిచి యూనివర్సిటీకి విజయం అందించాలని పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ట్రాక్‌సూట్, టీమ్ యూనిఫామ్ అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, బ్యాడ్మింటన్ కోచ్ వెంకటరెడ్డి, నాన్‌టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్లాస్టింగ్ ధాటికి ఎగసిపడిన రాళ్లు

- సల్కాపురంలో ఇద్దరు రైతులకు గాయాలు
- పొలం పనుల్లో ఉండగా చోటు చేసుకున్న ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



గాయాలపాలైన నవీన్

గట్టు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని సల్కాపురం గుట్ట వద్ద ఏర్పాటు చేసిన క్వారీలో నిర్వహించిన బ్లాస్టింగ్ ధాటికి రాళ్లు ఎగసి పడి ఇద్దరికి గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. దీనిపై బాధితులు గట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సల్కాపురం గుట్ట దగ్గర గల క్వారీలో ఉదయం పెద్ద ఎత్తున పేలుడు నిర్వహించారు. దీంతో పొలంలో ఉన్న రైతులు భయభ్రాంతులకు గురయ్యారు. గుట్ట పక్కల సల్కాపురం రైతుల పొలాలున్నాయి. దీంతో గ్రామానికి చెందిన నవీన్, పద్మ పత్తి తీస్తుండగా ఒక్కసారిగా గుట్ట వద్ద చేశారు. దీంతో రాళ్లు ఎగిరి వచ్చి పొలంలో ఉన్న నవీన్, పద్మపై రాళ్లు పడటంతో గాయాలు అయ్యాయి. నవీన్‌ను చికిత్స నిమిత్తం గద్వాల ఆసుపత్రిలో చేరగా, పద్మ స్థానిక గట్టు ఆసుపత్రిలో చికిత్స పొందింది. ముందస్తు సమాచారం ఇవ్వకుండా బ్లాస్టింగ్ జరపుతున్నారని.. దీంతో భయంగా పొలాల్లో పనులు నిర్వహిస్తున్నట్లు సల్కాపురం గ్రామస్థులు తెలిపారు. ఇటీవల నెల రోజుల క్రితం బ్లాస్టింగ్ ధాటికి రాళ్లు పడి మధ్యప్రదేశ్ చెందిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మరువకముందే మళ్లీ బ్లాస్టింగ్ ధాటికి సల్కాపురం రైతులు గాయపడటం మరింత ఆందోళనకు గురి చేస్తుంది. నిత్యం ఈ క్వారీ నుంచి కంకరను భారత్‌మాల రహదారి నిర్మాణం కోసం తరలిస్తున్నారు.

ప్రమాదాలు జరిగిన కొద్ది రోజులు మాత్రమే బ్లాస్టింగ్ బంద్ చేసి అనంతరం యథావిధిగా అక్రమ బ్లాస్టింగ్ జరుపుతున్నట్లు గ్రామస్థులు వెల్లడిస్తున్నారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని గట్టు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు నవీన్ తెలిపారు.

ప్రజలు మోసాల బారిన పడొద్దు: డీఎస్పీ



అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైం డీఎస్పీ

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులకు సైబర్ క్రైం డీఎస్పీ గిరికుమార్ గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇన్వెస్ట్‌మెంట్, అడ్వర్టైజ్‌మెంట్, జాబ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్టు, క్రెడిట్ కార్డు, సోషల్ మీడియాలో అనేక మోసాలు జరుగుతున్న ఘటనలు చూస్తున్నామన్నారు. వీటి గురించి యువత, ప్రజలు అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో సైబర్ క్రైం పోలీసు సిబ్బంది రవికుమార్, చిరంజీవి, శ్రీశైలం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యశాఖ అధికారులు

కుష్ఠును తొలి దశలోనే గుర్తించాలి

- 2030 లోగా వ్యాధిని నియంత్రించాలి
- జిల్లా ఉప వైద్యాధికారి వెంకటదాసు

కందనూలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కుష్ఠుని తొలి దశలో గుర్తిస్తే నయం చేయవచ్చని జిల్లా ఉప వైద్యాధికారి వెంకటదాసు తెలిపారు. గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వైద్యశాఖ సమావేశం మందిరంలో వ్యాధి నివారణపై లెప్రసీ ఇండియా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి మాట్లాడుతూ.. ఈ వ్యాధి బారిని పడిన వారికి ప్రారంభంలోనే చికిత్స అందించి ఏ ఒక్క రోగి కూడా అంగవైకల్యం బారిన పడకుండా సిబ్బంది కృషి చేయాలన్నారు. వ్యాధిపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేట్టాలన్నారు. ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు స్వయం సహాయ సంఘాలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. రాబోయే 2030 లోగా కుష్ఠుని నియంత్రించాలని, అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా టీకాల ప్రోగ్రాం అధికారి రవికుమార్‌నాయక్, లెప్రసీ ఇండియా ప్రతినిధులు నరసింహస్వామి, కామేశ్వర్‌రావు, డిప్యూటీ పారా మెడికల్ అధికారి సుకుమార్‌రెడ్డి, ఆకుతోట మధుమోహన్, వెంకటయ్య, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ పనులను అడ్డుకున్న గ్రామస్థులు



ఫ్యాక్టరీ నిర్మాణ ప్రాంతంలో బైఠాయించిన గ్రామస్థులు

రాజోలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను గురువారం గ్రామస్థులు అడ్డుకున్నారు. ఇటీవల అడ్డుకోవడంతో నిలిచిన పనులు మళ్లీ ప్రారంభించడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫ్యాక్టరీ వల్ల పొలాలు నాశనం అవుతాయని పనులు అడ్డుకుని నిరసన తెలిపారు. శాంతినగర్ సీఐ టాటాబాబు, రాజోలి ఎస్ఐ జగదీశ్వర్, తహసీల్దార్ రామ్మోహన్ సంఘటన స్థలానికి చేరుకొని కంపెనీ వారితో మాట్లాడారు. గ్రామస్థులకు నష్టం జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించి, పనులు మొదలు పెట్టాలని, అంతవరకు నిలిపివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. పనులు నిలిపివేయడంతో గ్రామస్థులు ఇళ్లకు వెళ్లారు.

ఘనంగా హజరత్ యూసుపొద్దీన్ ఉర్సు



ఊర్కొండలో ప్రత్యేక ప్రార్థలు నిర్వహిస్తున్న మత పెద్దలు

ఊర్కొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారి పై ఉన్న హజరత్ సయ్యద్ యూసుపొద్దీన్ మిర్జాయి చిస్తి దర్గాలో గురువారం ఉర్సు వైభవంగా భక్తి శ్రద్ధతో ఘనంగా కొనసాగుతున్నాయి. పలు జిల్లాలకు చెందిన మత పెద్దలు దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కల్వకుర్తిటౌన్: మండలంలోని మార్చాలలో గురువారం ఘనంగా గ్యార్వీ నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా పండుగను నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో దేశం అల్వాల్‌రెడ్డి, వట్టెపు కృష్ణయ్య, నిజాముద్దీన్, తలసాని కృష్ణారెడ్డి, ఖాజా మైనోద్దీన్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరుపై స్పష్టతేదీ?

మొదటి పేజీ తరువాయి...

రెండు, మూడో మోటారు పనులు దాదాపు పూర్తైన నీటిని ఎత్తిపోయడంలో అధికారులు విఫలమయ్యారు. ఎల్లూరు రెగుమాన్‌గడ్డ తీరంలో నిల్వ ఉండే వరద జలాలను ఎత్తి పోసి అంజనగిరి జలాశయం, ఏదుల జలా శయం, వట్టెం, కర్వెన, ఉద్దండాపూర్ జలాశయాలకు నీరు నింపాల్సి ఉంది. ప్రాజెక్టులో ప్రధాన భాగమైన నార్లపూర్ పంపుహౌజ్‌లో మొత్తం తొమ్మిది మోటార్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా అందులో గతేడాది ఒక్క మోటారును ప్రారంభించారు. అంజనగిరి రిజర్వాయర్‌కు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసి నిల్వ చేశారు. ఈ ఏడాది రెండు, మూడో మోటార్లు కూడా సిద్ధమయ్యాయి. నాలుగో మోటారు పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే మూడు మోటా ర్లు సిద్ధంగా ఉన్నా అంజనగిరి రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోయడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు లక్ష్యం..

శ్రీశైలం ప్రాజెక్టు తిరుగు వరద జలాల ఆధారంగా 60 రోజుల్లో 90 టీఎంసీల నీటిని ఎత్తిపోసి ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు నల్గొండ, రంగారెడ్డి జిల్లాలను సస్యశ్యామలం చేయాలని, ఈ జిల్లాల్లోని 70 మండలాల్లో 12 లక్షల 30 వేల ఎకరాలకు సాగునీరు, 1,226 గ్రామాలకు తాగు నీటితో పాటు పరిశ్రమలకు నీరందించాలనే ఉద్దేశంతో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పథకాన్ని ప్రారంభించారు. 2015లో రూ.35,200కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించినా దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ప్రాజెక్టులో ప్రధాన భాగమైన ప్యాకేజీ-1లో ఉన్న నార్లపూర్ పంపుహౌజ్‌లోని ఒక్క మోటారును గత ప్రభుత్వం ఆన్ చేసి రెండు టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేయగలిగింది. నార్లపూర్ పంపుహౌజ్‌లో మొత్తం ఎనిమిది మోటార్లకు గాను ఒకటి అదనంగా ఉంటుంది. ఒక్కో మోటారు 85 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తాయి. ప్రస్తుతం మూడు మోటార్లు నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధంగా ఉన్నా శ్రీశైలం ప్రాజెక్టు కృష్ణానది తిరుగు జలాలను వినియోగించుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు రంగారె డ్డి ప్రాజెక్టు నిర్మాణ పనులకు రూ.1,285 కోట్లు కేటాయించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్యాకేజీ-2లో ఉన్న అంజనగిరి జలాశయం పనులు దాదాపు పూర్తయ్యాయి. ప్యాకేజీ-3లో నార్లపూర్ జలాశయం నుంచి ప్యాకేజీ-4లో ఉన్న సొరంగం మార్గం పనులు కూడా దాదాపు పూర్తయ్యాయి. ప్యాకేజీ-6లో ఏదుల జలాశయం నుంచి ప్యాకేజీ-7వరకు ఉన్న కాల్వ పనులు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. కొల్లాపూర్ మండలంలో ఉన్న కుడికిళ్ల, తీర్నాంపల్లి వైపు కాల్వ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అదేవిధంగా ఏదుల జలాశయం ప్రాంతం సొరంగం పనులు పూర్తి కావాల్సి ఉంది. దీంతో నార్లపూర్ పంపుహౌజ్ నుంచి నీటిని ఎత్తిపోసిన ఏదుల జలాశయానికి సాగు, తాగునీటిని తరలించేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో రూ.వేల కోట్లు ఖర్చు పెట్టిన ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం అంజనగిరి రిజర్వాయర్‌కు మాత్రమే నీటిని ఎత్తిపోసే పరిస్థితి ఉన్న అధికారులు వాటిని కూడా వినియోగించుకోక పోవడంపై పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ఎన్నడూ పూర్తవుతుందోనని ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు టన్నెల్

రంజీ జట్టుకు ఎంపిక కావాలి

▸▸ జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్‌పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాకారులు పోటీల్లో ప్రతిభ చూపి రంజీ జట్టుకు ఎంపిక కావాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎండీసీఏ మైదానంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ టోర్నీలో భాగంగా గురువారం కొడంగల్, నారాయణపేట జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదన్నారు. జిల్లా నుంచి ఎందరో క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటారని గుర్తు చేశారు. గత ఏడాది జిల్లాకు చెందిన క్రీడాకారుడు రంజీకి ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఉమ్మడి జిల్లా టోర్నీలో ప్రతిభ చాటి, తుది జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యాక్షుడు సురేష్‌కుమార్, కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

తొమ్మిది వికెట్ల తేడాతో నారాయణపేట గెలుపు

ఉమ్మడి జిల్లా అండర్-23 ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీలో తొమ్మిది వికెట్ల తేడాతో నారాయణపేట జట్టు ఘన విజయం సాధించింది. ఎండీసీఏ మైదానంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో కొడంగల్, నారాయణపేట జట్లు తలబడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన కొడంగల్ జట్టు 16.5 ఓవర్లలో 35 పరుగులకు అలౌట్ అయ్యింది. నారాయణపేట బౌలర్లలో రోహణ్, అద్నాన్ చేరో మూడు వికెట్లు, ఎజాజ్ రెండు వికెట్లు తీసి రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నారాయణపేట జట్టు 6.1 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 36 పరుగులు చేసి విజయం సాధించింది. క్రీడాకారులు అద్నాన్ 17, తరుణ్ 12 పరుగులు చేసి జట్టు విజయానికి కృషి చేశారు.

సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ టోర్నీకి ఆదర్శ డిగ్రీ కళాశాల విద్యార్థులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పట్టణంలోని ఆదర్శ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ టోర్నీకి ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్రం, బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో నవంబర్ ఒకటి నుంచి ఐదవ తేదీ వరకు నిర్వహించనున్న సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే పీయూ జట్టుకు విద్యార్థులు అబ్దుల్ రఫే, రియాద్ మహ్మద్‌షేక్ ఎంపికయ్యారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారిని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటి జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ రాములు, కోశాధికారి అరుణ్‌కుమార్‌రెడ్డి, పీడీ ఇలియాజ్, ఆదర్శ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలు భేష్

సివిల్ సర్వీసెస్ ట్రైనీ అధికారుల మనోగతం



ధరూరులో ఎంపీడీవోతో మాట్లాడుతున్న ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు

ఉండవల్లి, మానవపాడు, అలంపూర్, ఎర్రవల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : "రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బేషుగ్గా ఉన్నాయి. వాటి అమలు చేయడంలో అధికారుల పాత్ర ఎంత ఉంటుందో, అంతకు రెట్టింపులో ప్రజల భాగస్వామ్యం ఉంటేనే మరిన్ని సత్ఫలితాలు సాధించవచ్చు" అని సివిల్ సర్వీసెస్ ట్రైనీ అధికారులు అభిప్రాయపడ్డారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన 25 మంది యువఅధికారులు శిక్షణలో భాగంగా కొన్ని రోజులుగా జోగుళాంబ గద్వాల జిల్లాలో పర్యటిస్తున్నారు. ప్రజలతో మమేకమవుతూ, పలు అంశాలపై అధ్యయనం చేస్తున్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఎలాంటి సంబంధం కలిగి ఉండాలో ప్రజలకు వివరిస్తున్నారు. ఇక్కడి ప్రజల జీవన విధానం, ఆహారపు అలవాట్లలో కొంత తేడా ఉన్నప్పటికీ, వారు చూపుతున్న అభిమానానికి, స్పందనకు వారు ఫిదా అవుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఉండవల్లి మండలం, బస్వాపురం, మానవపాడు, అలంపూర్, మల్దకల్, ధరూరు, ఇటిక్యాల మండల కేంద్రాల్లో గురువారం వారు పర్యటించారు. వారిలో కొందరు అధికారులను 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. పర్యటనలో వారు అధ్యయనం చేసిన విషయాలను తెలుసుకున్నది. వివరాలు వారి మాటల్లో...

విద్య, వైద్యం, రవాణా మెరుగుపడాలి



మాది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. ఐఆర్ఎస్ - 2022 బ్యాచ్. శిక్షణలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించడం వల్ల చాలా విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. బస్వాపురంలో మూడు రోజులు పర్యటించాం. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నాయో తెలుసుకున్నాం. ఇక్కడ ప్రధానంగా వైద్యం, రవాణా వ్యవస్థ లోపం స్పష్టంగా కనిపించింది. స్థానికులు చిన్న రోగాలకు కూడా చికిత్స కోసం దూర ప్రాంతాలైన కర్నూలు, అలంపూర్ పట్టణాలకు వెళ్తుండటం ప్రత్యక్షంగా చూశాం. రహదారులు బాగా లేకపోవడం కొంత ఇబ్బందిగా ఉంది. విద్య, వైద్యం, రవాణా వ్యవస్థ మెరుగుపడితే గ్రామాభివృద్ధి మరింత పుంజుకుంటుంది. ఈ ప్రాంతంలో ఉన్న వీఎస్టీ కంపెనీ స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్లు, సోలార్ లైట్లు ఏర్పాటు చేయడం, మొబైల్ అంబులెన్స్ ద్వారా వైద్య సేవలు అందించడం అభినందనీయం.

- అథుల్ కుమార్ సింగ్, ఐఆర్ఎస్ (ఐటీ), టీం లీడర్

ప్రజలు చైతన్యవంతులు కావాలి



రాజస్థాన్‌కు చెందిన నేను, ఐపీఎస్ - 2022 బ్యాచ్‌కు చెందిన వాడిని. హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి శిక్షణ కేంద్రంలో కొన్ని నెలల పాటు శిక్షణ పొందాం. వివిధ సివిల్ సర్వీసులకు చెందిన 125 మంది ట్రైనీ అధికారులు ఐదు జిల్లాలో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నాం. అందులో భాగంగా జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఎంపిక చేసిన గ్రామాల్లో క్షత్ర స్థాయిలో పర్యటిస్తున్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఆర్థిక స్వావలంబన, విద్య, ఉపాధి అవకాశాలను చక్కగా వినియో గించుకుని చైతన్యవంతులు కావాలి.

- రామకృష్ణ సరన్, ఐపీఎస్

నిధులను సక్రమంగా ఉపయోగించుకోవాలి



వివిధ సంక్షేమ పథకాల కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న నిధులను సక్రమంగా ఉపయోగించుకుంటే అభివృద్ధికి మరింత దోహదపడతాయి. గ్రామాల్లో నర్సరీ, వైకుంఠదామం, రైతువేదిక, సెగ్రిగేషన్ షెడ్లు, ఇంకుడు గుంతలు, హరితహారం, మిషన్ భగీరథ, పెన్షన్లు, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలను అమలు చేయడం నచ్చింది. పాఠశాలల్లో మౌలిక వసతులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంరక్షణ ఆశించిన స్థాయిలో ఉన్నాయి. గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో వైద్య సేవలు, హరితహారం ద్వారా మొక్కలు నాటి, సంరక్షించడంలో ప్రజలు భాగస్వాములు కావాలి. పొదుపు సంఘాల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి చెందుతున్నారు. సంక్షేమ పథకాల అమలులో అధికారులు, ప్రజలు సమన్వయంతో కృషి చేస్తే అందరూ సంతోషంగా ఉంటారు. మాది మధ్యప్రదేశ్ రాష్ట్రం, ఐఎఫ్ఓఎస్ - 2022 బ్యాచ్.

- హిమాన్ష్ త్యాగి, ఐఎఫ్ఓఎస్

నీటి వనరులను వినియోగించుకోవాలి



రెండు నదుల మధ్య ఉన్న ఈ ప్రాంతంలో నీటి వనరులను పూర్తి స్థాయిలో విని యోగించుకొని, ప్రతీ ఎకరానికి నీరందిం చాలి. ఈ విషయాన్ని సాగునీటి శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. మాది ఉత్తర ప్రదేశ్‌కు రాష్ట్రం. 2021లో ఐపీఎస్‌కు ఎంపికయ్యాను. శిక్షణలో భాగంగా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తు న్నాం. మానవ వనరుల అభివృద్ధికి ఈ పర్యటన ఎంతగానో దోహదపడుతుంది.

- లోకేష్ యాదవ్, ఐపీఎస్

అందరికీ సంక్షేమ ఫలాలు



తమిళనాడు రాష్ట్రంలోని అరుణచలం మా ఊరు. తల్లి దండ్రులు ప్రభుత్వ ఉద్యోగులు. ఎంబీబీఎస్ చేసి వైద్యుడిగా పని చేస్తున్నా, ఐపీఎస్ కావలన్నది నా కల. ఐపీఎస్ - 2021 బ్యాచ్‌కు చెందిన నేను శిక్షణలో భాగంగా బృందంతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నాను. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికీ అందుతు న్నాయి. రైతు బంధు రైతులకు చాలా ఉపకరిస్తోంది.

- ప్రసన్న కుమార్, ఐపీఎస్

ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి



ఇండియన్ కార్పొరేట్ లా సర్వీసెస్‌కు 2021లో ఎంపికయ్యాను. మాది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నట్లు గమనించాను. మహిళలు వ్యవసాయంతో పాటు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలి. మహిళలందరూ రొట్టెలు ఎగుమతి చేయడంపై అవగాహన కల్పించాలి.

- నిఖిత యాదవ్, ఐసీఎల్ఎస్

సీనియర్ ప్రోత్సాహంతో..



నాకు రెండు సంవత్సరాలు ఉన్నప్పుడే తల్లిదండ్రులు రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. చిన్నప్పటి నుంచి బామ్మ (భాగ్యవతి) దగ్గర ఉండి చదువుకున్నాను. మా ఇంట్లో ఎవరికీ ప్రభుత్వ ఉద్యోగం లేదు. నాకు డాక్టర్ కావాలని ఉండేది. కానీ మా సీనియర్ దివ్య ప్రోత్సాహంతో ఐఎఫ్ఓఎస్‌కు ఎంపికయ్యాను. అన్ని వసతులు ఉంటే ఎవరైనా చక్కగా చదువుకునే అవకాశం ఉంటుంది. అందుకోసం విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తాను.

-వల్లి, ఐఎఫ్ఓఎస్

ప్రజలకు సేవ చేయడమే ధ్యేయం



మాది ఉత్తరప్రదేష్ రాష్ట్రం, గౌహతి. ఐఎస్ఎస్ - 2024 బ్యాచ్. ప్రజలకు సేవ చేయడమే ధ్యేయం. అందుకోసం ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా చిన్నప్పటి నుంచి చదువుకున్నాను. అనుకున్న విధంగా లక్ష్యం చేరాను. అంకితభావంతో ప్రజలకు సేవ చేసి,వారి అభివృద్ధికి కృషి చేయడమే లక్ష్యంగా పనిచేస్తా.

- విజయ్ లద్దా, ఐఎస్ఎస్

గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలి




గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలన్నది నా కోరిక. మాది తమిళనాడు రాష్ట్రం. చెన్నైలోని అన్న యూనివర్సిటీలో చదువుకున్నాను. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తేనే ప్రజలు అభివృద్ధి చెందుతారు. ఆ దిశగా పని చేయాలనుకుంటున్నాను.

- రాజీవ్, ఐఐఎస్

యథేచ్ఛగా అక్రమ రవాణా

గ్రామాల్లో ఇంటింటికి తిరిగి రేషన్ బియ్యం సేకరణ



ఇటీవల ధరూరులో పట్టుబడిన రేషన్ బియ్యం

ధరూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలోని గద్వాల, అయిజ, ధరూరు, ఆత్మకూరు, అమరచింత తదితర ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. అక్రమ దందాను అరికట్టాలన్న ఉద్దేశంతో ధరూరు మండలంతో పాటు గద్వాల, బలిగెర, నందిన్నె తదితర ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా పెద్దగా ఫలితం ఉండటం లేదు. కొందరు అక్రమార్కులు రేషన్ బియ్యాన్ని రాష్ట్రం సరిహద్దు దాటించి, కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చెక్‌పోస్టుల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న కొందరు పోలీసు అధికారులు వారికి సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై పీడీ యాక్ట్ కేసులు పెట్టాలని ఉన్నతాధికారులు పలుమార్లు ఆదేశిస్తున్నా, కింది స్థాయి అధికారులు దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గ్రామాల్లో బియ్యం సేకరణ

ధనార్జనే ధ్యేయంగా కొందరు దళారులు ధరూరు మండల కేంద్రంతో పాటు, గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని ఎక్కడో ఒక చోట నిల్వ చేసుకొని దందా కొనసాగిస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని ఎవరికీ అనుమానం రాకుండా కోళ్ల దానా సంచుల్లో నింపుకొని బైక్‌లపై తరలిస్తున్నారు. ఒక వ్యక్తి ధరూరు మండల కేంద్రం మీదుగా ద్విచక్ర వాహనంపై ప్రతీ రోజు మూడు ట్రిప్పుల్లో బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నాడు. ఇలా 20 నుంచి 30 క్వింటాళ్ల వరకు బియ్యం పోగు చేసుకున్న తర్వాత ట్రాలీ ఆటోతో పాటు ఇతర వాహనాల్లో సరిహద్దు దాటిస్తున్నాడు. ఈ తంతు నెలల తరబడి కొన సాగుతున్నా ఏ అధికారీ పట్టించుకోవడం లేదని స్థానికులు చెప్తున్నారు.

కేసులనూ లెక్క చేయని మాఫియా

రేషన్ బియ్యం రవాణా చేస్తూ పట్టుబడి కేసులు నమోదవుతున్నా అక్రమార్కులు లెక్క చేయడం లేదు. కొద్ది రోజులు ఊరుకొని, మళ్లీ దందా కొనసాగిస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అందుకు గ్రామాల్లోని రేషన్ డీలర్లు వారికి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. రేషన్ అక్రమ దందాను అరికట్టడంలో అధికారులు, పోలీసులు విఫలం అవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రేషన్ బియ్యం దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం

గ్రామాల్లో ఎవరైనా రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నట్లు మా దృష్టికి వస్తే కేసు లు నమోదు చేస్తాం. ఇటీవల ధరూరు మండల కేంద్రంలో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేస్తాం. రేషన్ బియ్యాన్ని బార్డర్ దాటిస్తున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం. అనుమానిత వాహనాలను తనిఖీ చేస్తున్నాం.

- అబ్దుల్ షుకూర్, ఎస్ఐ, ధరూరు.

అన్ని రకాల వైద్య సేవలందించాలి

▸▸ రాష్ట్ర కుటుంబ సంక్షేమ, ప్రజారోగ్య శాఖ సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్రనాయక్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల వైద్యసేవలు అందేలా చూడాలని రాష్ట్ర కుటుంబ సంక్షేమ, ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిలకొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. కోయిలకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలనతో పాటు, పరిపాలన వ్యవహారాలపై చర్చించేందుకు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మాతా, శిశు ఆరోగ్యం, ఎన్‌సీడీ, గర్భిణులకు సంబంధించిన అన్ని పథకాలు, కార్యక్రమాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. డాక్టర్లు సకాలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు.

ప్రైవేటు ఆసుపత్రులను ఎప్పటి కప్పుడు తనిఖీ చేయాలని, నిబంధనలు పాటిం చని క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా అన్ని వైద్య కార్యక్రమాలలో ముందుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శశికాంత్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ భాస్కర్ నాయక్, డాక్టర్ రఫిక్, మాస్ మీడియా అధికారి డాక్టర్ మంజుల, ఏవో రమేష్‌బాబు, ఇతర సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

నేడు పాలమూరుకు రానున్న ఐటీ శాఖ మంత్రి

మహబూబ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాలమూరులో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించేందుకు శుక్రవారం రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాలమూరుకు రానున్నారు. ఉదయం 9.30 గంటలనుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మహబూబ్‌నగర్ పట్టణంలో పర్యటించనున్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ముందుగా మెట్టుగడ్డలోని అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్న భోజనం తరువాత దివిటిపల్లిలోని ఐటీ టవర్‌ను పరిశీలిస్తారు. అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.

క్రైం కార్నర్

బైక్‌పై నుంచి కింద పడి పోస్ట్ ఉమన్ మృతి

కేటీదొడ్డి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి ఓ పోస్ట్ ఉమన్ మృతి చెందింది. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని నందిన్నెకు చెందిన సుజాత(46) పోస్ట్ ఉమన్‌గా విధులు నిర్వర్తిస్తోంది. విధి నిర్వహణలో భాగంగా గురువారం నంది న్నె నుంచి మాచర్లకు మరో పోస్ట్‌మాన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, స్పీడ్ బ్రేకర్ వద్ద బండి అదుపుతప్పింది. దీంతో ఆమె బైక్‌పై నుంచి పడటంతో తలకు తీవ్ర గాయమైంది. ఆ దారిలో వెళ్తున్న వారు గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆమెను ప్రైవేటు అంబులెన్స్‌లో కర్ణాటకలోని రాయచూరు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. సుజాతకు భర్త విజయేంద్రచారి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

భార్యతో గొడవ పడి యువకుడి ఆత్మహత్య

జడ్చర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : భార్యతో గొడవ పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపురం గ్రామానికి చెందిన గుద్దేటి గోపాల్ (38) రెండు నెలల క్రితం వరకు గంగాపురం గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేశాడు. ఆ తర్వాత మద్యానికి బానిస అయిన గోపాల్ భార్యతో గొడవ పడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన ఆయన బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడ్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

స్కాలర్‌షిప్పులు వెంటనే విడుదల చేయాలి

▸▸ జడ్చర పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో ధర్నా



జడ్చర్లలో ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ సభ్యులు

జడ్చర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జడ్చర్ల పట్టణంలోని నేతాజీచౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఫీజు రీ అంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు దాదాపు రూ.7500కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీఅంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విద్యార్థులకు దూరం చేసి, విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్ర చేస్తుందని ఆరోపించారు. దాదాపు అరగంట పాటు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం ఆకస్మిక తనిఖీ

దేవరకద్ర, అక్టోబరు 24 : మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుపట్టిక, విద్యా ప్రగతి వివరాలను పరిశీలించారు. తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులపై ఆరా తీశారు. కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, ఎంపీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో బాలరామ్, సిబ్బంది చంద్రశేఖర్‌గౌడ్, అనూరాధ, సీఆర్పీ రాధిక తదితరులున్నారు.

బాలిక ప్రాణం ఖరీదు

రూ.13.50 లక్షలా?

గద్వాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పనిచేస్తున్న ఇంటివారి వేధింపులతో ఆత్మహత్యాయత్నం చేసిన బాలిక చికిత్స పొందుతూ కర్నూల్ ఆసుపత్రిలో గురువారం మృతి చెందడంతో ఒక్కసారిగా నిందితులు బేరాలు మొదలు పెట్టారు. స్థానికుల కథనం మేరకు.. జోగుళాంబ గద్వాల జిల్లాలోని మల్దకల్ మండల పరిధిలో గల బిజ్వారం గ్రామంలో ఇటీవల ఓ బాలికను సీడ్ ఆర్గనైజర్ తన ఇంటిలో పనిలో పెట్టుకొని బంగారు దొంగతనాన్ని మోపిన విషయం తెలిసిందే. ఆమెను పోలీసులు పిలిచి విచారించడంతో అవమానంగా భావించి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సీడ్ ఆర్గనైజర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆమె కొన్ని రోజులుగా కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. దీంతో కేసు తీవ్రం అవుతుందన్న క్రమంలో సీడ్ ఆర్గనైజర్, ఆయన బంధువు, ఓ నాయకుడు పావులు కదిపారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని కొత్త హౌసింగ్ బోర్డు కాలనీలో మల్దకల్ మండల పరిధిలోని ఓ మాజీ ప్రజాప్రతినిధి ఇంటిలో మృతురాలి తల్లిని మొదట భయభ్రాంతులకు గురిచేసినట్లు సమాచారం. మృతికి సంబంధించి తన పేరు బయటకు రాకుండా ఇతర కారణాలు చెప్పాలని ఆమెపై ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. తర్వాత ఆమెతో బేరసారాలు ఆ ప్రజాప్రతినిధి సమక్షంలో కుదిర్చారు. మొత్తానికి ఆ బాలిక ప్రాణం ఖరీదు రూ. 13.50 లక్షలకు బేరం కుదిరినట్లు తెలిసింది. డబ్బులు తీసుకున్న తర్వాత దొంగతనం నేరం మోపారని కాకుండా వేరే ఇతర కారణాలను పోలీసులకు చెప్పాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అయితే ఈ సంఘటన జరుగుతున్న విషయం పోలీస్ అధికారులకు తెలిసినా తెలియనట్లు మృతికి కారణమైన వారిని వెతికే ప్రయత్నాలు చేశారే కానీ, ఫలానా చోటా ఉన్నారని తెలిసినా మిన్నకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గద్వాలలోనే ఉన్న మృతురాలి తల్లిని వెంటనే వారు తమ ఆధీనంలోకి తీసుకోకుండా ఆమె కోసం పోలీసులు కర్నూల్‌కు వెళ్లారు. అయితే మృతురాలి తల్లి వాంగ్మూలం కోసం పోలీసులు ఎంత వెతికినా ఎలా కనిపిస్తుందో వారికే తెలియాల్సి ఉంది. అయితే ఓ బాలిక ప్రాణాలకు వెలకట్టి చేతులు దులిపేసుకుంటున్న సీడ్ ఆర్గనైజర్, అయన అన్నపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే. అయితే ఈ విషయంపై డీఎస్పీ సత్యనారాయణను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా మృతికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించడంతో పాటు మృతికి కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇంటర్వ్యూ..



గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఎంపీడీవో కోటేశ్వర్

కందనూలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా సత్వర చర్యలు తీసుకోనున్నట్లు నాగర్ కర్నూల్ ఎంపీడీవో కోటేశ్వర్ అన్నారు. పచ్చదనం పరిశుభ్రత, హరితహారం వంటి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మండలంలో చేపడుతున్న వివిధ పనులపై ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

సర్పంచ్‌లు లేకపోవడంతో గ్రామంలో పనులకు ఇబ్బందులు అవుతున్నాయా?

ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో గ్రామ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు వంటి పనులు చేపడుతున్నాం.

దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ముఖ్యంగా గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడా నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తల గురించి ప్రజలకు తెలుపుతున్నాం. దోమలను నివారించేందుకు తరచుగా ఫాగింగ్ నిర్వహిస్తున్నాం.

గ్రామాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలుగుతున్నాయా ?

గ్రామాల్లో వీధి దీపాలు నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఎక్కడా కూడా సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవడం, వీధి దీపాలు అన్నీ వెలిగే విధంగా చర్యలు చేపడుతున్నాం.

తాగునీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయా?

తాగునీటి సమస్య విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాం. ఎక్కడా కూడా సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం

ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయా?

గ్రామాల్లో ఉపాధి హామీ పనుల గురించి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. వచ్చే ఏడాది చేపట్టబోయే పనులను పరిశీలించి నివేదికను రూపొందిస్తున్నాం. హరితహారంలో భాగంగా మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నాం.

ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కందికొండ గీత

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన కందికొండ గీత ఎన్నికయ్యారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో కొత్తగూడెం జిల్లాలో జరిగిన ఐద్వా రాష్ట్ర మహాసభల్లో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆమె తెలిపారు. మహిళ హక్కుల కోసం, సమాజంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

విద్యాకమిషన్ సభ్యుడికి శుభాకాంక్షలు

కల్వకుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యునిగా నియమితులైన చారకొండ వెంకటేష్‌ను బీసీ జనసైన్యం రాష్ట్ర అధ్యక్షుడు, ఎల్లికల్ గ్రామానికి చెందిన సింగం నాగేష్‌గౌడ్ గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ ఏర్పాటు ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన వెంకటేష్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సముచితస్థానం కల్పించారన్నారు.

మాజీ సర్పంచ్ రాజీనామా

వంగూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి); మండలంలోని కోనాపూర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు క్యామ పరశురాములు గురువారం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని పార్టీ మండల అధ్యక్షుడు పండిత్‌రావుకు అందజేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ వ్యవహార శైలి నచ్చకనే పార్టీకి రాజీనామా చేసినట్లు పరశురాములు తెలిపారు.

క్రైం కార్నర్

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

కల్వకుర్తిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష, నగదు జరిమానా విధించిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎల్లికట్ట గ్రామానికి చెందిన షేక్ మాబాషా అనే వ్యక్తి డ్రంక్అండ్‌డ్రైవ్‌లో పట్టుపడగా, ఆయనను కోర్టులో హాజరుపరుచగా ఆయనకు 4 రోజుల జైలుశిక్ష, రూ.500 నగదు జరిమానా విధిస్తూ కల్వకుర్తి న్యాయాధికారి కావ్య తీర్పు ఇచ్చారని ఎస్‌ఐ పేర్కొన్నారు.

పొలం విషయంలో ఘర్షణ

- ఇరువురిపై కేసు నమోదు

వెల్దండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పొలం విషయంలో ఇద్దరు వ్యక్తులు ఘర్షణపడి కొట్టుకున్న సంఘటన మండలంలోని రాచూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాల్‌లింగం, సలేశ్వరం అను వ్యక్తులు పొలం విషయంలో ఘర్షణపడ్డారు. ఈ క్రమంలో గ్రామంలోని ఎస్సీకమ్యూనిటీ భవనంలో ఒకరిపై ఒకరు కర్రలతో దాడిచేసుకున్నారు. ఈమేరకు ఒకరిపై ఒకరు పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

అడ్డగోలుగా బ్యానర్లు

- అనుమతుల్లేకుండా మునిసిపాలిటీలో ఏర్పాటు
- వ్యాపార, రాజకీయ సంఘాలవే అధికం
- జరిమానా వేసేందుకు జంకుతున్న అధికారులు
- మునిసిపల్ ఆదాయానికి గండి

అచ్చంపేటటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వివిధ కార్యక్రమాల నిర్వహణ నేపథ్యంలో స్థానిక మునిసిపాలిటీ కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఎప్పుడూ పదుల సంఖ్యలో బ్యానర్‌లు కనిపిస్తున్నాయి. ఇలా మొత్తం ప్రధాన రహదారుల పొడవునా దాదాపు వందల సంఖ్యలో రోజూ అనుమతులు లేకుండా బ్యానర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అనుమతులు లేకుండా బ్యానర్‌లు ఏర్పాటు చేసే వారిపై చర్యలు తీసుకునేందుకు మునిసిపల్ శాఖ అధికారులు జంకుతున్నారు. దీంతో మునిసిపాలిటీ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. గతంలో అనుమతి లేకుండా బ్యానర్లు ఏర్పాటు చేసే వారిపై జరిమానాలు విధించే వారు.



పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ప్రధాన కూడళ్ల వద్ద అధికం

మునిసిపాలిటీలోని ప్రధానమైన అంబేద్కర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, నెహ్రూ చౌరస్తాతో పాటు ప్రధాన రహదారి వెంట ప్రతీ రోజు పదుల సంఖ్యలో ఫ్లెక్సీలు కడుతున్నారు. ఇందులో ఏ ఒక్కటి కూడా అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేస్తున్నవే. హోటళ్లు, హాస్పిటల్స్, షోరూంలు, రాజకీయ పార్టీల నాయకులకు సంబంధించినవి అధికంగా ఉంటున్నాయి. అనుమతి లేకుండా ఏర్పాటుచేసే వాటిని వెంటనే తొలగించకుండా మునిసిపాలిటీ సిబ్బంది ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. పది పదిహేను రోజులైనా జరిమానాలూ విధించడం లేదు. ఎప్పుడైనా తొలగించినా కమర్షియల్‌వే అధికంగా ఉంటున్నాయి. రాజకీయ పార్టీలవి అలాగే ఉంచుతున్నారు. ప్రతీ ఏడాది లక్షల్లో మునిసిపాలిటీకి సమకూరాల్సిన ఆదాయానికి గండి పడుతోందని విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

మునిసిపాలిటీ పరిధిలో ఫ్లెక్సీలు కట్టాలంటే తప్పకుండా మునిసిపాలిటీకి సంబంధించి టౌన్‌ప్లానింగ్ అధికారుల నుంచి రెండు, మూడు రోజుల ముందే అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం దరఖాస్తు చేసుకొని కొలతల లెక్క ప్రకారం

ముందస్తు అనుమతి తప్పనిసరి

ఎన్ని బ్యానర్‌లు కడుతున్నారో చెప్పి రుసుం మునిసిపాలిటీకి చెల్లించి, అనుమతి పొందాకే వాటిని కట్టాల్సి ఉంటుంది. మునిపాలిటీ పరిధిలో భవనాలపై ఏర్పాటు చేసే భారీ హోర్డింగ్‌లు దాదాపు ఐదు వరకు ఉన్నాయి. ఇవన్నీ ప్రత్యేక ఏజెన్సీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తారు. ఏజెన్సీల వారు సంవత్సరానికి ఒక్కసారి ఏర్పాటు చేసే హోర్డింగ్‌లను కొలతల ఆధారంగా మునిసిపాలిటీకి కొంత మొత్తాన్ని చెల్లించి వాటిని ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కానీ అందులో ఎంతవరకు నిజముందో తెలియాల్సి ఉంది.



అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫెక్సీలు

అనుమతి తప్పనిసరి

మునిసిపాలిటీలో బ్యానర్‌లు ఏర్పాటు చేసే వారు తప్పకుండా ముందస్తుగా మునిసిపాలిటీలో దరఖాస్తులు చేసుకొని అనుమతి తీసుకోవాలి. అనుమతుల్లేకుండా కట్టిన వాటిని వెంటనే తొలగించేందుకు మునిసిపాలిటీ అధికారులు చర్యలు తీసుకుంటారు. మునిసిపల్ ఆదాయానికి గండికొట్టాలని చూస్తే సహించేది లేదు. ప్రతీ ఒక్కరు అనుమతి తీసుకున్నాకే బ్యానర్లు కట్టుకోవాలి.

- శ్యాంసుందర్, మునిసిపల్ కమిషనర్

దెబ్బతిన్న బ్రిడ్జి పరిశీలన



వాగుపై బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న సింగిల్ విండో మాజీ చైర్మన్ రామన్‌గౌడ్

పెంట్లవెల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి మంచాలకట్ట, మాధవస్వామినగర్ గ్రామాలకు వెళ్లే దారిలో దెబ్బతిన్న బ్రిడ్జి పనులను గురువారం మాజీ సింగిల్ విండో చైర్మన్ రామన్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో కురిసిన భారీ వర్షాలకు వాగు పొంగిపొర్లడంతో బ్రిడ్జి చాలా వరకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. మంత్రి జూపల్లి సహకారంతో అయిదు లక్షల ప్రత్యేక నిధులతో బ్రిడ్జి మరమ్మతులు చేపడుతున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోవిందు, రవి పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికి వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల స్క్రూటినీ తప్పనిసరిగా చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మునిసిపల్, నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన, పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి పట్టణ ప్రాంతాల పరిధిలో 44,054 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు రాగా వివిధ మండలాల్లో మొత్తం 67,309 వచ్చాయని పేర్కొన్నారు. దరఖాస్తులు పరిష్కరించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల స్క్రూటినీ ప్రక్రియ నాలుగు దశల్లో చేయాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయం, డీపీవో రామ్మోహన్, నీటిపారుదలశాఖ ఈఈ మురళి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అరుణ, మునిసిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం సరఫరా చేయాలి

చారకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్న బియ్యాన్ని నేరుగా పాఠశాలలకే సరఫరా చేయాలని కోరుతూ గురువారం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి మాట్లాడుతూ కల్వకుర్తి రైస్ స్టాక్ పాయింట్‌నుంచి నేరుగా ప్రభుత్వ పాఠశాలలకు సన్నబియ్యం సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డీటీఫ్ మండల అధ్యక్షుడు రాజు, డీటీఫ్ నాయకులు జగదీశ్వర్, మోతిరాం, సురేష్, పాండయ్య, పాలమూరు అధ్యయన వేదిక కల్వకుర్తి కన్వీనర్ చింతపల్లి అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో ప్రజలకు మరింత చేరువ

- సోషల్‌మీడియా అచ్చంపేట అసెంబ్లీ కో ఆర్డినేటర్ అజీమ్



గాంధీ భవన్‌లో సోషల్ మీడియా సమావేశంలో పాల్గొన్న అచ్చంపేట కాంగ్రెస్ సోషల్ మీడియా ప్రతినిధులు

అచ్చంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువయ్యేందుకు అవకాశాలు అధికంగా ఉన్నాయని పలువురు సోషల్ మీడియా ప్రతినిధులు అన్నారు. సోషల్ మీడియాపై పట్టు సాధించేందుకు ఒక రోజు శిక్షణలో భాగంగా అచ్చంపేటకు చెందిన పలువురు సోషల్ మీడియా ప్రతినిధులు గురువారం గాంధీ భవన్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం చేపతుడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరవేసే విషయమై సూచనలు చేశారు. టెక్నికల్ అంశాలపై రాష్ట్ర సోషల్ మీడియా విభాగం ఇన్‌చార్జి మన్నె సతీష్, ఏఐసీసీ సోషల్ మీడియా చైర్‌పర్సన్ సుప్రియ శ్రీనాథ్ అధ్యక్షతన జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల సోషల్ మీడియా శిక్షణలో అచ్చంపేటకు చెందిన సోషల్ మీడియా కో ఆర్డినేటర్ అజీమ్, కో ఆర్డినేటర్ శివ, ఉప్పునుంతల సోషల్ మీడియా ప్రతినిధి శేఖర్, బల్మూర్ సోషల్‌మీడియా ప్రతినిధి శ్రీహరి, వంశీ, నందిరాజ్, లింగేశ్వర్ ఉన్నారు.

స్క్రాప్ వ్యాపారులపై జీఎస్టీ మినహాయించాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్‌గౌడ్

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్క్రాప్(ఇనుప చెత్త) రవాణాలో జీఎస్టీ పేరుతో నకిలీ ముఠా వసూళ్లకు పాల్పడుతూ వ్యాపారులను వేధింపులకు పాల్పడుతున్నారని, స్క్రాప్‌పై జీఎస్టీ రద్దు చేయాలని తెలంగాణ స్క్రాప్ కలెక్టివ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం తమ అవసరాలకు ఉపయోగించుకుని పారేసిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు సేకరించి పర్యావరణం కాపాడుతున్న స్క్రాప్ వ్యాపారులపై జీఎస్టీ వేయడం సరికాదన్నారు. స్క్రాప్ సేకరణ వ్యాపారం సమగ్రమైన చట్టం తీసుకురావడంతో పాటు కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసి వ్యాపారానికి లోన్ సౌకర్యం కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన కోరారు.

న్యూస్ బాక్స్

రేపు ఉమామహేశ్వర ఆలయ హుండీ లెక్కింపు

అచ్చంపేట అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ఉత్తరముఖ ద్వారమైన శ్రీఉమామహేశ్వర ఆలయంలో రేపు శనివారం ఉదయం 11గంటలకు హుండీ లెక్కింపు చేయనున్నట్లు ఈవో శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆర్డీవో మాధవి, తహసీల్దార్ శైలేంద్రకుమార్, ఎస్‌ఐ రమేష్, ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, కమిటీ సభ్యులతో కలిసి లెక్కింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కల్వకుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మునిసిపల్ పరిధిలోని 18వ వార్డులో కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి నిధుల నుంచి రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రహదారి, అండర్ డ్రైనేజీ పనులను గురువారం మాజీ సర్పంచి ఆనంద్‌కుమార్ పరిశీలించారు. పనులు మన్నికగా, నాణ్యతగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కాంట్రాక్టర్లరు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చందన, శానవాజ్‌శాన్, నాయకులు వర్కాల భాస్కర్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, రాంపర్వతాలు, జమ్ముల శ్రీకాంత్, మునిసిపల్ అధికారులు, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

మహిళలు రాణించాలి

కల్వకుర్తిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్నీరంగాల్లో రాణించాలని చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (డీసీపీయూ) టీం, చైల్డ్‌హెల్ప్‌లైన్ టీం సభ్యులు మధుబాబు, మల్లీశ్వరీలు అన్నారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలోని విద్యార్థులకు అవగహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. బాల్యవివాహాలు, బాలకార్మికులు, మీడియా ఎఫెక్టు, లింగ సమానత్వంపై అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్యలు చైల్డ్‌హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098కు కాల్‌చేసి సమస్యను వివరించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.జయమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

అచ్చంపేటటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మైనర్లు వాహనాలు నడుపుతూ కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని అచ్చంపేట ఎస్‌ఐ రమేష్ అన్నారు. గురువారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. వాహనాలు నడిపేవారు తప్పనిసరి హెల్మెట్ ధరించాలన్నారు. నంబర్ ప్లేట్‌లేని వాహనాలు కనిపిస్తే పట్టుకుంటామని, ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

- చెరువుల్లో చేప పిల్లలు వదిలిన ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ



చెరువుల చేపలను వదులుతున్న వంశీకృష్ణ

అచ్చంపేట/ టౌన్/ బల్మూరు/ మన్ననూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి); మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని అనంతవరం తుమ్మన్‌పేట, గోదల్ గ్రామాలలోని చెరువుల్లో చేప పిల్లలను వదిలారు. మండలంలోని పది సొసైటీల్లో 102 చెరువుల్లో 6 లక్షల 53వేల చేప పిల్లలను వదులుతామన్నారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, శ్రీపతిరావు, రాంప్రసాద్‌గౌడ్, మాసన్న పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ

డిండి బాలెన్సింగ్ రిజర్వాయర్ నక్కలగండి ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న మర్లపాడు తండా, కేశ్యాతండా ప్రజలకు అందాల్సిన ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం ఎక్సైజ్‌శాఖ, పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావును హైదరాబాద్‌లో నివాసంలో నక్కలగండి ప్రాజెక్టు భూ నిర్వాసితులతో కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామనాథం, మాజీ సర్పంచ్ భాస్కర్, నాయకులు, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

క్రీడా కళాశాల ఏర్పాటుకు కృషి

నల్లమలలో క్రీడా కళాశాల ఏర్పాటుకు రూ. 10కోట్లు కేటాయించి క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మన్ననూరు పీటీజీ కళాశాల ఆవరణలోని మైదానంలో నిర్వహించిన ఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే విజేతలైన క్రీడాకారులకు బహుమతుల ప్రదానం చేశారు. క్రికెట్ పోటీల నిర్వహణకు ఆర్థిక సహాయం అందించిన ఎస్‌బీఐ మేనేజరు రాములు, మేరాజ్, రాజారాం నాయక్‌లను అభినందించారు. కార్యక్రమంలో అచ్చంపేట మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, అమ్రాబాద్ మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, కోఆప్షన్ మాజీ సభ్యుడు రహీం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు రమణగౌడ్, బాలు, సంభు వెంకట్‌రమణ, జూలూరి సత్యానారాయణ, పెర్ముల వెంకటేశ్వర్లు, లోకనాథం, బుచ్చయ్య, తిరుపతి పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి

అచ్చంపేట పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మునిసిపాలిటీ కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రత్యేక సమావేశంలో పాల్గొని పట్టణాఅభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, కమిషనర్ శ్యాంసుందర్, అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వంగూరు : మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ కార్యకర్త డొక్కు శ్రీను కుటుంబాన్ని గురువారం అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకట్‌నారాయణ, పరశురాములు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

కల్వకుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో కల్వకుర్తి, ఊర్కొండ, వెల్దండ మండలాల కల్వకుర్తి ఏరియా కమిటీ మహాసభలో పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ, రైతుభరోసా ద్వారా ఎకరాకు రూ.15 వేలు వాగ్దానాలను నిలబెట్టుకోవాలని, రెండు పడకగదులను లబ్ధిదారులకు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి. ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు ఏపీ మల్లయ్య, పరశురాములు, చిలుక బాల్‌రెడ్డి, సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాత కేసులను త్వరగా పరిష్కరించాలి

- ప్రాసిక్యూషన్, పోలీసు అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి జ్యోత్స్న గుంటి

కొల్లాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి, కోడేరు మండలాల పరిధిలోని పాత కేసులను సత్వరంగా పరిష్కరించే దిశగా తమ వంతు కృషి చేయాలని స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి జ్యోత్స్న గుంటి అన్నారు. స్థానిక ప్రాసిక్యూషన్ అధికారి, సీఐ, ఎస్‌ఐ, ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు, ఫారెస్టు అధికారులతో కోర్టు కానిస్టేబుళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోత్స్న గుంటి మాట్లాడుతూ 1వ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి బాధ్యతలు నిర్వర్తిస్తూ, అదనంగా గౌరవ హైకోర్టు వారు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జిగా, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా, లోక్ అదాలత్ చైర్మన్‌గా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తిగా అదనపు బాధ్యతలు ఇచ్చారని గుర్తు చేశారు. కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి , కోడేరు మండలాల పరిధిలోని పాత కేసులను సత్వరంగా పరిష్కరించే దిశగా తమ వంతు కృషి చేయాలని కోరారు. డిసెంబరులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించాలని, అదే విధంగా మార్నింగ్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ సదస్సుకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లు హృశికేష్, సతీష్, గోకరి, రామన్ గౌడ్, ఎక్సైజ్ అధికారులు కోర్టు క్లర్క్‌లు శ్రీనివాసు, హరీష్, షాకిర్, శివుడు, లోక్ అదాలత్ ఇంచార్జీ బోగ హరికృష్ణ, పోలీసు కానిస్టేబుల్స్ రాములు, మంగ్లా, రాజశేఖర్ హాజరయ్యారు.

టీజీవోస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా జయమ్మ

కల్వకుర్తిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : టీజీవోస్ నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా కల్వకుర్తి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కె.జయమ్మ ఎన్నికయ్యారు. టీజీవోస్ ఉద్యోగుల సమస్యలకు కృషిచేస్తానని ఆమె తెలిపారు. ఈ ప్రాంతం నుంచి మహిళా ఉద్యోగి ఎన్నిక కావడంపట్ల ఆమెను పలువురు టీఎన్‌జీవోస్, టీజీవోస్ ఉద్యోగ సంఘ నాయకులు అభినందించారు.

డిప్యుటేషన్‌పై పని చేస్తున్న సిబ్బందిని తొలగించాలి

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దీర్ఘకాలికంగా డిప్యుటేషన్‌పై పని చేస్తున్న వారితో పాటు అధికారికంగా పని చేస్తున్న ఉపాధ్యాయులను తొలగించి కొత్త వారిని నియమించాలని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందించి ఉపాధ్యాయుల్లో అనుమానాలకు తావు లేకుండా దీర్ఘకాలికంగా పని చేస్తున్న వారిని పాఠశాలలకు పంపించి, వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.శ్రీధర్‌శర్మ, జిల్లా నాయకులు పి.వహీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి : సీఐటీయూ

కొల్లాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ తెలిపారు. ఈ మేరకు సమ్మె నోటీసును మునిసిపల్ ఛైర్ పర్సన్ రమ్యకు కార్మికులతో కలిసి అందజేశారు. మునిసిపల్ యూనియన్ నాయకులు రాము, ప్రసాద్, భగవాన్, రఘు, లక్ష్మి, చంద్రకళ, చిరంజీవి, కురుమయ్య, చెన్నయ్య మల్లికార్జున్, మునిసిపల్ కార్మికులు పాల్గొన్నారు.

'ఉన్నతాధికారులు స్పందించాలి'

చారకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : చారకొండ శివారులో తన వ్యవసాయ భూమి పొరపాటున ఇతరు వ్యక్తులపై నమోదైందని, ఆ భూమిని తన పేరుపై సరి చేయాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఆరేళ్ల యాదయ్య గౌడ్ గురువారం విలేకరుల ముందు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

పూసల కులస్తులను ఆర్థికంగా ఆదుకోవాలి

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పూసల కులస్తులకు ప్రభుత్వం రుణాలు అందించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని పూసల సంఘం రాష్ట్ర నాయకుడు తన్నీరు నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పూసల సంఘం ఆధ్వర్యంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం పూసల కులస్తులను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పూసల సంఘం రాష్ట్ర నాయకుడు పొదిల రామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లయ్య, ఉపాధ్యక్షుడు కోనేటి సుధాకర్, వీరముష్టిలు పాల్గొన్నారు.

చెన్నంపల్లిలో బోర్ డ్రిల్లింగ్

పదర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ నిధులతో బోర్ డ్రిల్లింగ్ చేపట్టినట్లు యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంత్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 2 ఇంచ్‌ల నీరు పడిందని, దానికి వెంటనే మోటారు బిగించినట్లు తెలిపారు. గ్రామస్థులు తాగునీటి కష్టాలు తప్పాయని సంతోషంతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ఉన్నారు.